ఎడతెరిపిలేని వాన

- రెండురోజులుగా కురుస్తున్న వర్షాలు
- లోతట్టు ప్రాంతాలు జలమయం
- నిండుకుండల్లా చెరువులు
- ఉధృతంగా మూసీ ప్రవాహం
- పలుచోట్ల కూలిన చెట్లు
- రాకపోకలకు తీవ్ర అంతరాయం
- పరిశీలించిన అధికారులు, ప్రజాప్రతినిధులు

ఎల్‌బీనగర్‌లో రెండురోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయం కాగా, పలు చోట్ల రోడ్లు కాలువలను తలపిస్తున్నాయి. చెరువులు నిండుకుండలను తలపిస్తున్నాయి. అధికారులు ముంపు ప్రాంతాలను ఎప్పటికప్పుడు పరిశీలించి ప్రజలకు ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. పలు కాలనీల్లో చెట్ల కొమ్మలు విరిగిపడడంతో సిబ్బంది వెంటనే చర్యలు చేపడుతున్నారు. –ఎల్‌బీనగర్


నాగోలు ప్రధాన రహదారిపై వరద


ఆస్మాన్‌ఘడ్‌లో ట్రాలీ ఆటోపై కూలిన చెట్టు కొమ్మ


బీఎన్‌రెడ్డినగర్ పాపిరెడ్డి కాలనీలో..


అధికారులతో మాట్లాడుతున్న జోనల్ కమిషనర్ హేమంత కేశవ్ పాటిల్


సత్యనగర్ కాలనీలో కూలిన చెట్టును పరిశీలిస్తున్న కార్పొరేటర్ పవన్‌కుమార్


విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేస్తున్న సిబ్బందితో కార్పొరేటర్..


నాగోలు వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న మూసీ నది


హయత్‌నగర్ డివిజన్‌లో చెట్ల కొమ్మల తొలగింపును పరిశీలిస్తున్న కార్పొరేటర్..

డివిజన్లలో పర్యటించిన కార్పొరేటర్లు..
ఏకధాటిగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో కార్పొరేటర్లు పర్యటించి పరిస్థితులను పరిశీలించారు. లింగోజిగూడ డివిజన్‌లో స్థానిక కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి పర్యటించి ముంపు ప్రాంతాల ప్రజలకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకున్నారు. కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ పవన్‌కుమార్ పలు కాలనీల్లో పర్యటించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

ముంపు ప్రాంతాల్లో జోనల్ కమిషనర్..
ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్ ఐఏఎస్ అధికారి హేమంత కేశవ్ పాటిల్ నియోజకవర్గ పరిధిలోని ముంపు ప్రాంతాల్లో పర్యటించారు. ఇంజినీరింగ్ అధికారులను అక్కడి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు ఇబ్బందుల్లేకుండా సత్వర చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

నిండు కుండలా సరూర్‌నగర్ చెరువు ..
సైదాబాద్: ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద చేరుతుండడంతో సరూర్‌నగర్ చెరువు నిండుకుండను తలపిస్తోంది. ఆస్మాన్‌ఘడ్‌లో భారీ వృక్షం కొమ్మ కూలి పక్కనే ఉన్న ట్రాలీ ఆటోపై పడింది. మరో మూడు రోజులు భారీ వర్షాలు కురుస్తాయనే వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో అత్యవసరమైతే తప్ప ఎవరూ బయటకు రావద్దని అధికారులు సూచిస్తున్నారు.

కార్పొరేటర్ పర్యటన..
మన్సూరాబాద్: మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి డివిజన్ పరిధిలోని లోతట్టు ప్రాంతాలైన అమ్మదయకాలనీ, సరస్వతీనగర్, ఆగమయ్యనగర్, సాయినాథ్ కాలనీ, హాకీమాబాద్, గణేశ్‌నగర్, వీకర్‌సెక్షన్‌కాలనీ, మన్సూరాబాద్ పెద్ద చెరువు ప్రాంతాలను ఆదివారం పరిశీలించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు.

లోతట్టు కాలనీవాసుల ఆందోళన ..
దిల్‌సుఖ్‌నగర్: మలక్‌పేట్‌జోన్ పరిధిలోని పలు కాలనీలు జలమయంగా మారాయి. దీంతో ట్రాఫిక్ స్తంభించింది. మూసీనది వరద ప్రమాదకరంగా ప్రవహిస్తుండంతో మలక్‌పేట్, దిల్‌సుఖ్‌నగర్ మూసీతీర ప్రాంతవాసులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

కొత్తపేట సత్యనగర్‌లో కూలిన చెట్ల కొమ్మలు..
నాగోలు: కొత్తపేట డివిజన్ సత్యనగర్ కాలనీలో వర్షాలకు చెట్టు కూలిపోయింది. విషయం తెలుసుకున్న కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్ కుమార్ అక్కడికి వెళ్లి పరిశీలించారు. వెంటనే హార్టికల్చర్ డిపార్ట్‌మెంట్ సూపర్‌వైజర్ వెంకటేశ్‌ను పిలిచి చెట్టును, కొమ్మలను వెంటనే తొలగించేలా చర్యలు తీసుకోవాలని కోరగా అడ్డుగా ఉన్న కొమ్మలను తొలగించారు..

సిబ్బంది అందుబాటులో ఉండాలి
చంపాపేట: వర్షాల నేపథ్యలో సర్కిల్, విద్యుత్ శాఖ సిబ్బంది, అధికారులు కాలనీవాసులకు అందుబాటులో ఉండాలని చంపాపేట డివిజన్ కార్పొరేటర్ వంగ మధుసూధన్‌రెడ్డి కోరారు. సర్కిల్ సిబ్బందితో కలిసి లోతట్టు కాలనీల్లో ఆదివారం పర్యటించారు. విద్యుత్ స్తంభాలు, కూలిన భారీ వృక్షాలను తొలగించి నూతన స్తంభాలను ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. ఆయన వెంట నాయకులు మల్లేశ్‌గౌడ్, అవినాష్‌రెడ్డి, సందీప్, వేణుగౌడ్, విద్యుత్, సర్కిల్ సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ పర్యటన..
నాగోలు: కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ జీహెచ్‌ఎంసీ అధికారులు, డీఈ నవీన్ కుమార్, ఏఈ మాతృనాయక్, వర్క్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లతో కలిసి లోతట్టు ప్రాంతాల్లో పర్యటించారు. సిబ్బందితో కలిసి వరద సాఫీగా వెళ్లేలా చర్యలు చేపట్టారు.


ఎస్‌ఆర్‌ఎల్ కాలనీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ పవన్‌కుమార్..


నిండుకుండలా సరూర్‌నగర్ చెరువు

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
చాదర్‌ఘాట్: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మలక్‌పేట ఎమ్మెల్యే బలాల సూచించారు. ఓల్డ్‌మలక్‌పేట పార్టీ కార్యాలయంలో ఆదివారం మాన్సూన్ టీం, శానిటేషన్, జలమండలి అధికారులతో సమావేశం నిర్వహించారు. వర్షపునీరు నిల్ల ఉండకుండా చర్యలు తీసుకోవాలని జలమండలి అధికారులను ఆదేశించారు. మ్యాన్‌హోళ్ల మూతలు తెరిస్తే ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుందని జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అలాగే తాగునీరు కలుషితం కాకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు.

మూసీ పరీవాహక ప్రాంతాలను పర్యవేక్షిస్తున్నాం
చాదర్‌ఘాట్: భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో కమిషనర్ ఆదేశాల మేరకు మూసీ ముంపు ప్రాంతాలను అధికారులతో కలిసి పర్యవేక్షిస్తున్నామని మలక్‌పేట సర్కిల్–6 డీసీ జయంత్ తెలిపారు. ఆదివారం ఓల్డ్‌మలక్‌పేట, శంకర్‌నగర్, పాపయ్యబస్తీ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. అనంతరం సర్కిల్ కార్యాలయంలో మాట్లాడుతూ.. వరద ఉధృతి ఎక్కువైతే సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని కోరారు. దాదాపు 120 మంది జీహెచ్‌ఎంసీ సిబ్బందితో మూసీ వెంట పర్యవేక్షిస్తున్నామని తెలిపారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి
నాగోలు: భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ కమ్యూనిటీ పారామెడికల్ వైద్యుల ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ అశోక్ ఉక్కల ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వైద్యం అందిస్తున్న ఆర్‌ఎంపీ, పీఎంపీ వైద్యులు కూడా ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరారు.

రైతు బజార్లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్, వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరల వివరాలు. టమాటా రూ.15, వంకాయ రూ.23, బెండ రూ.23, పచ్చిమిర్చి రూ.23, కాకరకాయ రూ.23, బీరకాయ రూ.35, కాలిఫ్లవర్ రూ.18, క్యాబేజీ రూ.13, క్యారెట్ రూ.45, దొండ రూ.33, ఆలుగడ్డ రూ.36, ఉల్లిగడ్డ రూ.44, గోకరకాయ రూ.23, దోసకాయ రూ.13, సొరకాయ రూ11, పొట్లకాయ రూ.13, అరటికాయ రూ.11, చిక్కుడుకాయ రూ.55, అర్వి రూ.40, మునగ రూ.28, చిలుకడ దుంప రూ.55, బీట్‌రూట్ రూ.28, కీర రూ.23, బీన్స్ రూ.75, క్యాప్సికం రూ.45. ఈ ధరలు సోమవారం ఉదయం 9 గంటల వరకు అమల్లో ఉంటాయి.

నియామకం


జగన్నాథంకు నియామక పత్రం అందజేస్తున్న దృశ్యం

లింగోజిగూడ: బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం విశ్వకర్మ సెల్ రాష్ట్రస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ విశ్వకర్మ సెల్ రాష్ట్ర కో కన్వీనర్‌గా ఎల్‌బీనగర్‌కు చెందిన కాలే జగన్నాథంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు రాష్ట్ర కన్వీనర్ పూసల బ్రహ్మచారి నియామకపు పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జగన్నాథం మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేయడంతో పాటు విశ్వకర్మల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

రజనీగోవింద్‌కు ‘స్ఫూర్తి పురస్కారం’


స్ఫూర్తి పురస్కారం అందుకుంటున్న రజనీగోవింద్

మన్సూరాబాద్: ఆదిత్యానగర్‌కాలనీకి చెందిన సంగీత విద్వాంసురాలు రజనీగోవింద్‌కు ప్రాంతీయ గురువందన్ ఛాత్రా అభినందన్ స్ఫూర్తి పురస్కారం–2024 ను భారత్ వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మన్సూరాబాద్‌లో రజనీగోవింద్ మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ నుంచి గాత్రం, వయోలిన్, కర్ణాటక సంగీతంలో ఎంఎ పట్టా పొంది కొన్నేళ్లుగా అనేకమంది విద్యార్థులకు సంగీత శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు.

పోచమ్మ కల్యాణానికి హాజరు


కల్యాణానికి హాజరైన ఉప్పల శ్రీనివాస్‌గుప్తా

నాగోలు: నాగోలు డివిజన్ పరిధిలోని ఎరుకల నచరమ్మ కాలనీ ఆదర్శనగర్ డబుల్ బెడ్రూంలో ఆదివారం నిర్వహించిన గాలి పోచమ్మ అమ్మవారి కల్యాణంలో టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్ అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్తా పాల్గొన్నారు. కార్యక్రమంలో దుర్గయ్య, చైర్మన్ రుపాని లింగ స్వామి, ప్రధాన కార్యదర్శి భీమన పల్లి సిద్ధు తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు చోట్ల ముగ్గురి అదృశ్యం

సైదాబాద్: వేర్వేరు చోట్ల ముగ్గురు వ్యక్తులు అదృశ్యమైనట్లు పోలీసులకు అందాయి. సైదాబాద్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జనగామ జిల్లా దేవరుప్పల గ్రామానికి చెందిన చింత నాగమణి రెవెన్యూ శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తుంది. ఆమె భర్త ఆంజనేయులు (46) పీజీ పరీక్షలు రాసేందుకు గత నెల 20న ఊరి నుంచి బయలుదేరి సైదాబాద్ రెడ్డికాలనీలోని స్నేహితుడు ఉంటున్న దివ్యాంగుల హాస్టల్‌కు చేరుకున్నాడు. అక్కడి నుంచి గత నెల 21న పరీక్ష రాసేందుకు వెళ్లి తిరిగి రాలేదు. సెల్‌ఫోన్ సైతం స్విచ్ఛాఫ్ వస్తోంది. పలుచోట్ల ఆచూకీ కోసం గాలించినా ఫలితం లేకపోవడంతో అతని భార్య నాగమణి సైదాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

మరో ఘటనలో వ్యాపారి..
సైదాబాద్‌లో నివసించే కటుకం శ్రీనివాస్ (52) వ్యాపారంలో నష్టం రావడంతో ప్రస్తుతం ఇంట్లోనే ఉంటున్నాడు. దీంతో ఒత్తిడికి గురై గత నెల 29న ఇంట్లోనే ఫోన్ పెట్టి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. అతని గురించి బంధువులు, స్నేహితుల వద్ద విచారించినా ఫలితం లేకుండా పోయింది. దీంతో అతని భార్య అనిత సైదాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

పక్షవాతానికి గురైన వ్యక్తి..
సింగరేణి కాలనీలో నివసిస్తూ ప్రైవేట్ జాబ్ చేసే నీల భర్త చందు (47) మూడేళ్లుగా పక్షవాతంతో బాధపడుతూ ఇంట్లోనే ఉంటున్నాడు. గత నెల 30న ఇంట్లో ఎవరికీ చెప్పకుండా తమ సమీపంలో నివసించే తెలిసిన వ్యక్తి సహాయంతో ఆటోలో వెళ్లాడు. విషయం తెలుసుకున్న అతని భార్య నీల బంధువులు, స్నేహితుల వద్ద వెతికినా ఆచూకీ తెలియకపోవడంతో సైదాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. సైదాబాద్ పోలీసులు మూడు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హిందువులను సురక్షితంగా తీసుకురావాలి

హుడాకాంప్లెక్స్: బంగ్లాదేశ్‌లోని భారతీయులను సురక్షితంగా తీసుకొచ్చే విషయంపై కేంద్ర ప్రభుత్వం స్పందించాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి వక్కలంక శ్రీనివాసరావు ఒక ప్రకటనలో కోరారు. రిజర్వేషన్ల పేరుతో బంగ్లాదేశ్ విద్యార్థులు చేసిన ఉద్యమాన్ని పక్కదారి పట్టించి హిందువులను లక్ష్యంగా చేసుకొని దాడులు చేయడం బాధాకరమన్నారు. బంగ్లాలో 19 వేల మంది భారతీయులు ఉండగా వారిలో కొద్దిమంది మాత్రమే భారత్‌కు వచ్చారని, మిగతా వారిని అతి క్రూరంగా హతమార్చడం, హత్యాచారాలు చేయడంతో పాటు దేవాలయాలను ధ్వంసం చేస్తున్నారన్నారు. ఇస్లామిక్ మతోన్మాదుల అరాచకాలపై ఉక్కుపాదం మోపాల్సిన అవసరం ఉందన్నారు. వెంటనే కేంద్ర ప్రభుత్వం చొరవ తీసుకొని హిందువులను దేశానికి తీసుకొచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

తుక్కుగూడ: రెండురోజుల నుంచి ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలకు నియోజకవర్గ ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి కేఎల్‌ఆర్ సూచించారు. ఆదివారం తుక్కుగూడ మున్సిపాలిటీ కేంద్రంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో మాట్లాడారు. తమ సమీపంలో ఉన్న లోతట్టు ప్రాంతాలను అధికారులు గుర్తించి, వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. ప్రజలకు అంటువ్యాధులు వ్యాపించకుండా సిబ్బందిని అందుబాటులో ఉంచాలని మున్సిపల్, వైద్య సిబ్బందిని ఆదేశించారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి


విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్సులు అందజేస్తున్న హెచ్‌ఎం, నోసా ప్రధాన కార్యదర్శి

నాగోలు: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని నాగోల్ జడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మీదేవి, పూర్వ విద్యార్థుల సంఘం (నోసా)ప్రధాన కార్యదర్శి మేకల సత్యనారాయణ అన్నారు. పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే వాలీబాల్, ఖోఖో పోటీల్లో పాల్గొనే విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్సులను నాగోల్ జడ్పీ పాఠశాల పూర్వ విద్యార్థుల సంఘం (నోసా) ఆధ్వర్యంలో ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా వారు నోసా ఫౌండర్ టీంతో పాటు సహకారం అందించిన 2002–03 బ్యాచ్ సభ్యులను అభినందించారు. వర్షాల కారణంగా పాఠశాలలో శనివారం జరగాల్సిన కబడ్డీ పోటీలు వాయిదా వేశామని, త్వరలోనే నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమానికి సహకరించిన నోసా ప్రెసిడెంట్ కందికంటి కన్నా గౌడ్, ఉపాధ్యక్షుడు బొడ్డుపల్లి సురేశ్, సిద్ధి రమేశ్, సంయుక్త కార్యదర్శి పల్లె లింగం గౌడ్, డోనార్స్ కమిటీ సభ్యులు జిల్కపల్లి శ్రీనివాస్ రెడ్డి, అనంతుల శ్రీనివాస్ రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ నాళ్ల ఉమామహేశ్వర్ గుప్తా, మునిందర్ రెడ్డి, స్పోర్ట్స్ కార్యదర్శి బొడ్డుపల్లి మహేందర్, అజాద్, అంజు, కిషన్, సలహాదారుడు మెండు వెంకట్ రెడ్డి, నోసా జూనియర్ టీం 2002–23 బ్యాచ్ సభ్యులు జగదీశ్వర్, జనగాం సహదేవ్, స్వాతి రెడ్డి, కండికంటి సాయిబాబా, నిమ్మల రంజిత్ రెడ్డి, మూల లింగం గౌడ్, గుండెల చంద్రమోహన్, నరసింహ, చితుల్ల వినోద్‌గౌడ్, బొడ్డుపల్లి రాధిక, సిరిగిరి కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

అ‘పూర్వ’ సమ్మేళనం

మీర్‌పేట: మీర్‌పేట కార్పొరేషన్ పరిధి జిల్లెలగూడ ఉన్నత పాఠశాల 2009–10వ బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం కనకదుర్గ ఫంక్షన్‌హాల్‌లో ఉత్సాహంగా జరిగింది. ఈ సందర్భంగా ఒకరినొకరూ ఆత్మీయంగా పలకరించుకొని తమ చిన్ననాటి మధుర జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనంతరం విద్యార్థులు తమకు పాఠాలు బోధించిన ఉపాధ్యాయులను శాలువాలతో ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బాలనారాయణ, గణేశ్, వెంకట్‌రెడ్డి, రమాదేవి, భాస్కర్, సురేందర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, నర్సిరెడ్డి, విద్యార్థులు భాస్కర్, రాంబాబు, శంకర్, మల్లేశ్, నగేశ్, శ్రీశైలం, రమేశ్, శివకృష్ణ పాల్గొన్నారు.



ఉత్తమ కోచ్ అవార్డు


అవార్డుతో ముబీనా ఖాన్

వనస్థలిపురం: నగరంలోని వనస్థలిపురానికి చెందిన ముబీస్ ఫిట్‌నెస్ జోన్ వ్యవస్థాపక శిక్షకురాలు ముబీనా ఖాన్‌ను ఉత్తమ కోచ్ అవార్డు వరించింది. ఢిల్లీలో సీఈపీఐ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో దేశం నలుమూలల నుంచి మహిళా మైండ్ అండ్ బాడీ ఫిట్‌నెస్ శిక్షకుల్లో ఉత్తమమైన వారిని ఎంపిక చేసి యేటా ఈ అవార్డులు అందజేస్తారు. ఈ ఏడాది నగరానికి చెందిన ముబీనా ఖాన్ ఎంపికై అవార్డు అందుకున్నది.

కమిటీ ఎన్నిక


కరుణాకర్‌రెడ్డి, అధ్యక్షుడు

నాగోలు: కొత్తపేట డివిజన్ ఎల్‌బీనగర్‌లోని శ్రీ శివగంగ కాలనీ సంక్షేమ సంఘం నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా తుమ్మల కరుణాకర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా రేషం నర్సయ్య, ప్రధాన కార్యదర్శిగా గోలి వంశీధర్‌రెడ్డి, కోశాధికారిగా మీలా శ్రీధర్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా పున్‌రెడ్డి రాంరెడ్డి, జాయింట్ సెక్రటరీగా కొమ్మ నాగభూషణ్‌రెడ్డి, లీగల్ అడ్వైజర్‌గా మంద సుఖజీవన్ రెడ్డి, అడ్వైజర్‌గా పాటివెంకట నర్సింహారెడ్డి , కార్యవర్గ సభ్యులుగా గట్టుపల్లి మోహన్‌రెడ్డి, కోట్ల భూపతిరావు, ఉడుత శ్రీకాంత్, గుబ్బ కిశోర్‌గుప్తా, ఆయిత రాములు, నాగోలు మారుతీరెడ్డిని ఎన్నుకున్నారు.

విజయవంతం చేయండి

తుక్కుగూడ: బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ తుక్కుగూడ మున్సిపల్ అధ్యక్షుడు రచ్చ లక్ష్మణ్ అన్నారు. ఆదివారం మున్సిపాలిటీ కేంద్రంలో బీజేపీ సభ్యత్వ నమోదు సన్నాహక సమావేశం నిర్వహించారు.

బీసీల ఆమరణ దీక్షపై ప్రభుత్వం స్పందించాలి


దీక్ష చేస్తున్న సిద్దేశ్వర పటేల్‌ను పరామర్శిస్తున్న నాయకులు

నాగోలు: బీసీల ఆమరణ దీక్షపై ప్రభుత్వం సత్వరమే స్పందించాలని తెలంగాణ వనరుల పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు గ్యోర శ్యాంసుందర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి మారోజు రామాచారి డిమాండ్ చేశారు. సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రిలో నిరాహార దీక్ష చేస్తున్న హిందూ బీసీ మహాసభ అధ్యక్షుడు బత్తుల సిద్ధేశ్వర పటేల్‌ను ఆదివారం వారు పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కులగణన చేపట్టి, స్థానిక సంస్థల రిజర్వేషన్లు 42 శాతం బీసీలకు కేటాయించాలన్నారు. పరామర్శించిన వారిలో బీసీ జనసభ అధ్యక్షుడు రాజారాం యాదవ్ సోషల్ జస్టిస్ పార్టీ అధ్యక్షుడు చామకూర రాజు, తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జి కేవీ గౌడ్, కుల గణన పోరాట కమిటీ అధ్యక్షుడు అవ్వారు వేణు కుమార్, అంబేద్కర్ ఆజాద్ సంఘం అధ్యక్షుడు కొంగర నరహరి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ నిర్మాణంలో ఇంజినీర్ల పాత్ర కీలకం

ఎమ్మెల్సీ కోదండరాం


ఎమ్మెల్సీ కోదండరాంను సత్కరిస్తున్న వెంకట్‌రెడ్డి, తదితరులు

హుడాకాంప్లెక్స్: తెలంగాణ భవిష్యత్ నిర్మాణంలో ఇంజినీర్ల పాత్ర కీలకమని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. సరూర్‌నగర్‌లోని పాపడం హోటల్‌లో ఆదివారం గేట్ మాస్టర్ ప్రెస్‌మీట్ సక్సెస్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మీకు రాజకీయ నాయకులు కానీ బాసులు కానీ ప్రధానం కాదన్నారు. చట్టమే మీకు అన్నింటికి మించిన సుప్రీమ్ అని తెలిపారు. తప్పు అని తెలిసి కూడా తప్పులు చేస్తే తిప్పలు తప్పవన్నారు. నిజాయితీ నిబద్ధతతో కూడిన ఉద్యోగం చేస్తే అందరూ మీకు సలాం చేస్తారని, అలా కాకపోతే మీరు అందరికీ సలాం చేస్తూ తల దాచుకోవాల్సి వస్తుందన్నారు. అనంతరం గేట్ మాస్టర్ డైరెక్టర్ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. ఇటీవల విడుదలైన ఏఈఈ ఫలితాలలో 509 మంది గెజిటెడ్ ఆఫీసర్స్ తమ అకాడమీ నుంచి ఎంపికయ్యారని తెలిపారు. అనంతరం స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించిన వ్యక్తి డి.వెంకట్‌రెడ్డికి బహుమతి ప్రదానం చేశారు.